ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఓట్ల లెక్కింపులో పొరపాట్లకు తావివ్వొద్దు

- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి
- కౌంటింగ్ సూపర్‌వైజర్లకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ గోపాల కృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకొని ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులను పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగాకలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి వారికి కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్ సందేహాలను జేసీ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాల నాధికారి శ్రీకాంత్, ఎన్నికల విభాగం సిబ్బంది, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు

7లో

సాగుకు సన్నద్ధం

- జిల్లాలో 2.14 లక్షల సాగు విస్తీర్ణం
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- ఖరీఫ్ ప్రణాళిక రూపొందించిన వ్యవసాయ శాఖ
- వర్షాలు పడితే పంట విస్తీర్ణం పెరిగే అవకాశం



నాగులుప్పలపాడు మండలం మాచరంలో నువ్వులు ఎదబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు దుక్కులు దున్ని సాగుకు సమయాత్త మయ్యారు. పశ్చిమ ప్రకాశంలో రైతులు బోర్లు కింద పచ్చి రొట్ట ఎరువులు సాగు చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.14 లక్షల హెక్టార్లు. వర్షాలు ఆశించిన స్థాయిలో వడితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను రూపొందించిన వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఆర్‌బికెల ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జూన్ నుంచి ఖరీఫ్ ప్రారంభం కానుండటంతో అవసరమైన ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సాగు ఆశించి స్థాయిలో లేదు. వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు సైతం సాగు చేసిన పంటలను నాశనం చేశాయి. దీంతో అన్నదాతలు బాధలు వర్ణనాతీతం. ఈ ఏడాది ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో పంటలు సాగు చేయాలని రైతులు భావిస్తున్నారు. ఇందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2,14, 536 హెక్టార్లు కాగా ప్రధానంగా పచ్చి రొట్ట ఎరువులు జీలుగ, జనుము, పిల్లి పెసర, అపరాలైన కంది, మినుములు, పెసలు, వరి పంటలను రైతులు సాగు చేస్తారు. కృష్ణా బేసిన్, నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తే మాగాణి సాగు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది వరి పంట సాగు అనుకున్నంత స్థాయిలో లేకపోవటంతో బియ్యం ధరలకు రెక్కలొచ్చిన సంగతితెలిసిందే. 25 కిలోల బిపిటి 2లో

పేరుకే వ్యవసాయ మార్కెట్ కమిటీలు

- నిర్మాణానికి నోచని కొత్త గోదాములు
- పంట ఉత్పత్తుల నిల్వ కోసం రైతుల ఇక్కట్లు
- కానరాని పశువైద్యశిబిరాలు
- పట్టించుకోని అధికారులు



బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీలు వారి అవసరాలను తీర్చలేక పోతున్నాయి. వాణిజ్య పరంగా కూడా తగిన చేయూత ఇవ్వలేని పరిస్థితులు కొనసాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో ఏటా ఐదు లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మిరప, శనగ, పత్తి,పొగాకు, మొక్కజొన్న, వేరుశనగ, పసుపు తదితర పంటలు కూడా సాగు అవుతున్నాయి. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాముల నిర్మాణాలు జరగలేదు. దీంతో రైతులు ప్రైవేట్ గోదాముల్లో తమ పంటలను ఉంచుకుని నష్టపోతున్నారు.గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రైతులు పలు రకాల ప్రయోజనాలు పొందేవారు. రైతుబంధు పథకంగా ద్వారా తమ ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ ఉంచుకుని తక్షణమే రుణం పొందేవారు. తర్వాత తమ పంటలకు తగిన మద్దతు ధర వచ్చాక అమ్ముకునేవారు. ఇటీవల కాలంలో రైతుబంధు పథకం అమలుకు నోచడం లేదు. రైతుల పంట ఉత్పత్తులపై వచ్చే సెస్స్ ద్వారా ఉచిత పశువైద్యశిబిరాలు నిర్వహించేవారు. ఇప్పుడు అవి లేకుండా పోయాయి. రైతుల అవసరాల మేరకు పొలాల నుంచి పంటల తరలింపు కోసం అంతర్గత రోడ్లు నిర్మించేవారు. ప్రస్తుతం వాటి ఊసే లేదు. ఏటా వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రూ.28 కోట్ల మేర మార్కెట్ ఫీజు వసూలు అవుతోంది. అయినప్పటకీ రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. జిల్లో బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు, సంత మాగులూరు, వేమూరు,రేపల్లే, కూచినపూడిలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. 28 చెక్‌పోస్టుల ద్వారా ఏటా రూ.7 కోట్ల మేర వసూలు చేస్తున్నారు. చెక్‌పోస్టులు, ట్రేడ్ లైసెన్సుల ద్వారా జిల్లా మార్కెటింగ్ శాఖకు సుమారుగా రూ. 28 కోట్ల మేర ఆదాయం సమకూరుతుంది. అయినప్పటికీ రైతులు పండిస్తున్న పంటల నిల్వలకు అవసరమైన మేర గోదాముల నిర్మాణాలు చేపట్టలేదు. జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 66 వేల మెట్రిక్ టన్నుల కెపాసిటి కలిగిన 66 గోదాములు మాత్రమే ఉన్నాయి.రైతుల అవసరాలకు అవి 2లో



సమ్మర్ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులు

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

8లో



మంటల్లో కాలిపోయిన కారు

కక్షల నేపథ్యంలో కారుకు నిప్పు

3లో

తిరునాళ్లను సంతోషంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక ముదిరాజ్ సోదరులు రామాలయం గుమ్మటం తిరునాళ్లను సంతోషంగా జరుపుకోవాలని కొండపి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ఆకాంక్షించారు. ముదిరాజ్ సోదరుల ఆహ్వానం మేరకు శనివారం తిరునాళ్లకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు స్థానికులను పేరు పేరునా ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అందరూ కలిసికట్టుగా తిరనాళ్లను జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి టంగుటూరు పట్టణ అధ్యక్షులు కామని నాగశ్రీను, పమిడి సుబ్బానాయుడు, కామినేని కోటేశ్వరరావు, చదలవాడ వేణు, రావూరి సతీష్ బాబు, కసుకుర్తి శ్రీధర్, ముదిరాజ్ నాయకులు రుద్రబోయిన రమణయ్య, అనుమోల రమేష్, స్థానికులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పోతుల

సాగుకు సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

బియ్యం బస్తా రూ.1400 నుంచి 1600 పలికింది.

63.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో మే సాధారణ వర్షపాతం 51.3 మిల్లీమీటర్లు కాగా 25వ తేదీ నాటికి 63.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 38 మండలాలు ఉండగా 27 మండలాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైంది. 11 మండలాలలో తక్కువ వర్షపాతం నమోదైంది. దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి రేమాల్ తుపాన్‌గా మారటంతో జిల్లాలో చిన్నపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో మే నెలలో వర్షపాతం మరింతగా నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

జిల్లాలో 616 రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్ అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరి విత్తనాలు క్వింటాల్‌కు రూ.500 సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోంది. కందులు, మినుములు, పెసలు విత్తనాలకు 30 శాతం సబ్సిడీ, పచ్చి రొట్ట ఎరువులకు 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తోంది.

రైతులను ఆదుకునేందుకు కృషి

డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఖరీఫ్‌లో రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు కృషిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎఫ్ శ్రీనివాసరావు తెలిపారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన 40,000 క్వింటాళ్ల వరి విత్తనాలు, 1500 క్వింటాళ్ల కందులు, 5000 క్వింటాళ్ల మినుములు, 1200 క్వింటాళ్ల పెసలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పచ్చి రొట్ట ఎరువులు 667 క్వింటాళ్ల ,జీలుగు విత్తనాలు, 1716 క్వింటాళ్ల జనుము, 390 క్వింటాళ్ళ పిల్లి పెసర విత్తనాలు రైతుల కోసం ఆర్‌బికెలలో సిద్ధం చేశామన్నారు. ఖరీఫ్‌లో అవసరమైన ఎరువుల అందుబాటులో ఉన్నాయని, డిమాండ్‌ను బట్టి ఎరువుల కోసం ఇండెంట్ పెడతామని ఆయన తెలియజేశారు.

పేరుకే వ్యవసాయ మార్కెట్ కమిటీలు

(మొదటిపేజీ తరువాయి)

అవి సరిపోని పరిస్థితి ఉంది. జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో కనీసం 3 వేల మెట్రిక్ టన్నుల కెపాసిటి ఉన్న గోదాముల నిర్మాణాలు చేపట్టాల్సిఉంది. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు మరిన్ని ఓపెన్ ప్లాట్‌ఫారాలు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో 20 ఓపెన్ ప్లాట్‌ఫారాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవి రైతుల అవసరాలకు సరిపోవడం లేదు.ఓపెన్ ప్లాట్‌ఫారాలు, గోదాములు లేక రైతులు ఏటా తమ పంటలను నష్టపోతున్నారు. పంట చేతికి అంది వచ్చే దశలో సంభవిస్తున్న తుఫాన్లు, భారీ వర్షాల కారణంగా తడిసిన పంటను ఆరబెట్టుకునే అవకాశం లేక,గోదాముల్లో నిల్వ చేసుకునే సౌకర్యం లేక రైతులు నష్ట పోతున్నారు. గత ఐదేళ్ళకాలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో గోదాముల నిర్మాణాలు జరగలేదు. జిల్లాలో నూతనంగా గోదాముల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. జిల్లాలో ఉన్న గోదాములకు మరమ్మతులు జరిపేందుకు రూ.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించి టెండర్లు పిలిచారు. అయినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతుబంధు పథకం అమలు లోకి తేవాలని, పశువైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఓపెన్ ప్లాట్‌ఫారాలు, గోదాములు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


దాసిరెడ్డిపాలెంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని దాసిరెడ్డిపాలెం గ్రామంలో పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండపి సర్కిల్ సిఐ పాండురంగారావు, ఎస్ఐలు రాజేష్, శివబసవరాజు, కృష్ణబాజిబాబు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రజాశక్తి-మద్దిపాడు



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, నారాయణమ్ రాజశేఖర్ ఆచార్యులు, దివి వెంకటాశేషాచార్యులు, శ్రీనివాస కృష్ణమాచార్యులు కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. దీనిని తిలకించేందుకు దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తరంగా విద్వాన్ ఘోరకవి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వినిపించిన తరంగా గానం భక్తులను అలరింపజేసింది. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలబడి నిరీక్షించారు. వందలాదిగా వచ్చిన భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అడుగడుగునా మల్లవరం గ్రామ ప్రజలు, భక్త బృందాలు తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మల్లవరం గ్రామంలో దేవస్థానం ప్రాంగణం వద్ద అనేక సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలలో ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు. వందలాది భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా కేంద్రాలలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం మాజీ ఛైర్మన్ నారా నాగిరెడ్డి, ఇఒ దామా సుబ్బారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాజీ మంత్రి శిద్దా ప్రత్యేక పూజలు

మద్దిపాడు మండలంలోని మల్లవరం గ్రామం ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామి వారిని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు శిద్దా రాఘవరావుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ నారా నాగిరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో వేంచేసిఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దేవస్థానం ట్రస్టీ చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, ఇఓ మీనిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాగలూరి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కళ్యాణ మహోత్సవాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి వారు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా రథోత్సవం

రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణ మహోత్సవం అనంతరం శనివారం సాయంత్రం తెలగసంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగుండూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మంచి జరుగుతుందనే ఉద్దేశంతో ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారి దీవి శ్రీధర్‌బాబు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజారులు శ్రీనివాసరావు, రంగయ్య పంతులు, సిబ్బంది వేణు, సుబ్బారావు, దేవస్థాన కమిటీ సభ్యులు, వివేకానందస్వామి కమిటీ సభ్యులు కె శ్రీనివాసరావు, పి శివాజీ, కె శంకరావు, చిరంజీవి పాల్గొన్నారు.

కక్షల నేపథ్యంలో కారుకు నిప్పు

అర్ధరాత్రి 12 తర్వాత ఘటన • భయభ్రాంతులకు గురైన భార్యాభర్తలు • చుట్టుపక్కల వారు వచ్చి కాపాడిన వైనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని మూలగుంటపాడులో ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చిగురుపాటి శేషగిరి రావు నివాసంలో శుక్రవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో ఇంటి ముందు పెట్టి ఉన్న కారు క్రేటాలో పైన అద్దం పగలగొట్టి మూడు బాటిళ్ల పెట్రోలు పోసి నిప్పు అంటించారు. ఇంటి ముందు ఉన్న కారు నుంచి ఒక్కసారిగా పొగలతో కూడిన మంటలు రావడంతో పక్క వీధిలో ఉన్న ఓ యువకుడు గుర్తించి ఇంటిలో నిద్రలో ఉన్న చిగురుపాటి శేషగిరిరావు దంపతులను నిద్ర లేపే ప్రయత్నం చేశారు. ఎంతసేపటికీ లేవకపోడటంతో ప్రహరీ ఎక్కి తలుపులు తీసే ప్రయత్నం చేశాడు. కిటికీ వద్దకు వెళ్లి గట్టిగా కొట్టడంతో అప్పుడు లేచిన శేషగిరి దంపతులు బయటకు వచ్చాయి. అప్పటికే కారు పూర్తిగా తగలబడింది. చుట్టుపక్కల వారు మొత్తం లేచి కారు మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. 100 కు ఫోన్ చేయటంతో ఎస్ఐ టి శ్రీరామ్ ఘటన స్థలానికి చేరుకొని చుట్టుపక్కల పరిశీలించి అక్కడ పడి ఉన్న పెట్రోల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని వెళ్లారు. అయితే శనివారం ఉదయం అందరికీ పూర్తిస్థాయిలో తెలిసిపోవడంతో చిగురుపాటి శేషగిరి నివాసం వద్దకు భారీగా జనం చేరుకున్నారు. అసలు రాజకీయ కోణమా లేక వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిందనే విషయంపై పోలీసులు విచారణ



తగలబడుతున్న కారు

మొదలుపెట్టారు. ఏఎస్పి క్రైమ్ శ్రీధర్‌బాబు ఒంగోలు డిఎస్‌పి ఎం కిషోర్ బాబు, సిఐలు దాచేపల్లి రంగనాథ్, వై పాండురంగారావు, జగదీష్ రంగంలోకి దిగి శేషగిరితో మాట్లాడారు. కారుని పరిశీలించారు. పక్క వీధిలో ఉన్న చిగురుపాటి వెంకటేశ్వరరావు నివాసంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆ సిసి కెమెరాల ఆధారాల మేరకు పోలీసులు విచారణ మొదలుపెట్టారు. శింగరాయకొండకు చెందిన ఈశ్వర్ లాడ్జికి చెందిన ఈశ్వర్ రెడ్డి అనే వ్యక్తి తన షాపులో పనిచేసే ఇద్దరు యువకుల ద్వారా పెట్రోల్ తీసుకువెళ్లి కారు మీద పోయించారనే అనుమానంతో పోలీసుల విచారణ మొదలుపెట్టారు. సిసి కెమెరాలో వచ్చిన ఫొటోల ఆధారంగా కేసును మొదలు పెట్టిన పోలీసులు ముందుగా లాడ్జిలో పనిచేస్తున్న యువకులను అదుపులోకి తీసుకొని విచారించి ఆ తర్వాత ఈశ్వర్‌రెడ్డిని కూడా పారిపోతున్న నేపథ్యంలో నెల్లూరు దగ్గర ఆపి పట్టుకోవడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి కారు తగలబెట్టిన నిందితులను విచారణ చేసే పనిలో ఉన్నారు. చిగురుపాటి శేషగిరిరావు నివాసానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావును సందర్శించి అక్కడ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఫోన్లో పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య కూడా చిగురుపాటి శేషగిరిని ఫోన్లో పరామర్శించారు. వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి కూడా చిగురుపాటి శేషగిరిని పరామర్శించారు. కొండపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఆర్ కుమార్, డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు కారు తగలబడిన తీరును అక్కడకు వచ్చి అడిగి తెలుసుకున్నారు.

పూర్తిస్థాయిలో విచారణ జరపాలి: ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

తెలుగుదేశం పార్టీ నాయకులు చిగురుపాటి శేషగిరిరావు నివాసంలో జరిగిన కారు దహనానికి సంబంధించి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కోరారు.

రంగనాయకుడికి వెండి శంఖువు ప్రదానం

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం జే పుల్లలచెరువు గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామికి త్రిపురాంతకం గ్రామానికి చెందిన గుర్రం సుబ్రమణ్యం శ్యామల దంపతులు శనివారం 425 గ్రాముల వెండి శంఖువును ప్రదానం చేశారు. దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి బి రమేష్ ఈ శంఖువును అందుకుని స్వామికి సమర్పించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎస్‌విఎస్‌ఎన్ మూర్తి, నెమలిగుండ్ల రంగనాయక స్వామిని సందర్శించి, దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని దేవస్థానం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెసి



వెండి శంఖువు ప్రదానం చేస్తున్న గుర్రం సుబ్రమణ్యం శ్యామల దంపతులు

కార్యాలయం పర్యవేక్షకులు మల్లిఖార్జున్ రెడ్డి, మార్కాపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు, దేవస్థాన సిబ్బంది రాజేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్‌సెర్చ్: సిఐ

ప్రజాశక్తి-గిద్దలూరు



సీజ్ చేసిన బైకులతో గిద్దలూరు పోలీసులు

నేరాలను నియంత్రించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని అర్బన్ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ప్రజల రక్షణార్థమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవితం గడపాలన్నారు. అలాగే పరిసరాలలో ఎవరైనా అనుమానిత, కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రంగయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: దర్శి నగర పంచాయతీలో అక్రమంగా తిప్పుతున్న 10 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు దర్శి సిఐ షేక్ షమీముల్లా తెలిపారు. శనివారం దర్శి నగర పంచాయతీ లోని సాయి నగర్‌లో అక్రమంగా తిప్పుతున్న వాహనాలను తనిఖీ చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. హిందీలో లైసెన్స్ లేనివి, టాక్స్ కట్టనవి మొదలైనవి ఉన్నాయని అన్నారు. అదేవిధంగా నాలుగు ఆటోలు కూడా స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు. వీరి వెంట ఎస్ఐ సుమన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కనిగిరి: ప్రకాశం జిల్లా ఎస్పీ సుమిత్ సునీల్ గరుడ్ ఆదేశాల మేరకు కనిగిరి డిఎస్‌పి రామరాజు ఆధ్వర్యంలో కనిగిరి సిఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది కనిగిరి మండలం చాకిరాలలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. గ్రామంలో కొత్త వ్యక్తులు ఎవరైనా ప్రజాశాంతికి భంగం కలిగించేటట్లు వ్యవహరిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనిగిరి ఎస్ఐ త్యాగరాజు, హనుమంతునిపాడు ఎస్ఐ శివ నాగరాజు, పిసి పల్లి ఎస్ఐ రమేష్ బాబు, సర్కిల్లోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

28న బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని డిజిపేట గ్రామంలో ఈ నెల 28వ తేదీ రాష్ట్రస్థాయి ఎడ్లతో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఒక ప్రకటనలు తెలిపారు. కోదండ రామస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎడ్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు ఇస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.10 వేలు వంతున ఇస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన ఎడ్ల యజమానులు 27వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలి: ఐజి

ప్రజాశక్తి-దర్శి

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు రేంజి ఐజి ఎస్ త్రిపాఠీ అన్నారు. శనివారం సాయంత్రం దర్శి డిఎస్పీ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ గరుడు సుమిత్ సునీల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ముందు కౌంటింగ్ అనంతరం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గరడ్ సుమిత్ సునీల్ దర్శి డిఎస్పి టి అశోకవర్ధన్‌రెడ్డి, సిఐలు ఎస్‌కె షమీముల్లా, డి మల్లికార్జున, నాగరాజుతో పాటు దర్శి ఎస్ఐ సుమన్, 9మంది ఎస్ఐలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లపై చర్చ

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల కంటెస్టింగ్ క్యాండిడేట్స్ మరియు వారి ఏజెంట్స్‌తో దర్శి రిటర్నింగ్ అధికారి మరియు దర్శి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జూన్ 4న రైజ్ కాలేజీలో జరగబోయే కౌంటింగ్ ఏర్పాట్ల కోసం చర్చించారు. పార్లమెంటు మరియు అసెంబ్లీ కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏ విధంగా ఏర్పాటు చేస్తున్నారో వివరించారు. కంటెస్టింగ్ క్యాండిడేట్స్ లేదా వారి ఏజెంట్లు సమర్పించవలసిన ఫామ్-18 వీలైనంత త్వరగా ఇవ్వాలని, సదరు కౌంటింగ్ ఏజెంట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కు నలుగురు ఏజెంట్లను నియమించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఏ విధమైన మొబైల్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కౌంటింగ్ హాల్ లోపలికి అనుమతించబడవని అన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఏ విధమైన ఊరేగింపులు, సభలు నిర్వహించాలన్నా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. బాణసంచా కాల్పులు నిషేధించబడ్డాయని, అతిక్రమించిన వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కల్యాణ మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని డిజిపేట గ్రామంలో కోదండరామస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 27వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గోపూజ, గంగా నయనం, గణాధిపతి పూజ, పుణ్యాహవచనం తదితర పూజ కార్యక్రమం నిర్వహించారు.



గాయపడిన గిరిజనుడు

గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి చేయగా తీవ్రంగా గాయపడిన సంఘటన యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల ఇష్టకామేశ్వరి ఆలయానికి 10 కిలోమీటర్ల దూరంలో శనివారం సాయంత్రం జరిగింది. గాంధీ నగర్ చెంచు గూడేనికి చెందిన కుడుముల బయన్న అనే గిరిజనుడు అటవీ ఫల సేకరణ నిమిత్తం ఇష్టకామేశ్వరి సమీపం లోని అభయారణ్యంలోకి వెళ్లాడు. ఫలసేకరణ నిమిత్తం చెట్లను వెతుకుతుండగా అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. తీవ్రంగా గాయపరిచింది. ఇష్టకామేశ్వరి చెంచుగూడెం గిరిజనుల ద్వారా విషయం తెలుసుకున్న గాంధీ నగర్‌కు చెందిన చెంచులు క్షతగాత్రుడిని నంద్యాల జిల్లా సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలిస్తామన్నారని గిరిజనులు తెలిపారు.



జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం అల్లీనగరం గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని కొమరోలు ఎస్ఐ మధుసూదన్‌రావు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని అన్నారు. పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదనరావు హెచ్చరించారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పొదిలి

మారుతున్న ఆధునిక సమాజంలో ఇటీవల కాలంలో తీవ్ర ప్రభావం చూపుతున్న పిల్లల అక్రమ రవాణా పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. చిన్న వయసులో పిల్లలను ముఖ్యంగా ఆడపిల్లలను ట్రాప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకునే ముఠాల పట్ల తల్లిదండ్రులు ముఖ్యంగా తల్లులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న న్యాయవాదులు ట్రాఫికింగ్‌తో పాటు పలు సమాజ రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిబి ధర్నాసి రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంవి రమణ కిషోర్, షేక్ షబ్బీర్, జి శ్రీనివాసులు, సుజాత, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం క్రిష్టంశెట్టిపల్లి రైతు భరోసా కేంద్రంలో గిద్దలూరు మండల వ్యవసాయాధికారి వై విజయ భాస్కర్‌రెడ్డి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు (జనుములు, పిల్లిపెసర) పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాల వలన కలుగు ఉపయోగాలు రైతులకు తెలియజేసి, ఎకరాకు 10 కిలోలు చొప్పున వేసుకొని, పూత దశకు వచ్చినప్పుడు పొలంలో కలియ దున్నుకోవడం వలన భూసారం పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. రబీ 2023-24 పంట నష్ట పరిహార జాబితా సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే 2-3 రోజుల్లో తెలియజేయాలని అన్నారు.



మిఠాయిలు పంచుతున్న తాళ్లూరి బాబూరావు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

విద్యార్థులు విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకొని మరింత విజ్ఞానాన్ని పెంచుకోవాలని గ్రంధ పాలకుడు సుగుణరావు అన్నారు. 9వ రోజు స్థానిక శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. దనిలో భాగంగా 28మంది విద్యార్థులు హాజరైనారు. స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పడం, డ్రాయింగ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్ బ్యాంక్ అధికారి తాళ్లూరి బాబురావు విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు పంచిపెట్టారు.



కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

కలాం ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - కర్లపాలెం

నిరుపేద కుటుంబాలను అందుకోవడంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఎప్పుడు ముందు ఉంటుందని ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష అన్నారు. కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకరం బావి సమీపంలో ఒక నిరుపేద కుటుంబంకు 10 కేజీల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో షేక్ హబీబ్, బహదూర్ బాష, షేక్ జానీ బాష, షేక్ జిలాని, షేక్ గఫూర్, ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, పఠాన్ కరిముల్లా, సయ్యద్ అజీమ్ బాబు, పఠాన్ మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న చల్లా రామయ్య

పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల సమీపంలో వికలాంగుల కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగ వంతం చేయాలని అన్నారు. అందుకు ప్రభుత్వ అధికారులు ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే ఏకైక మార్గమనే దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో గుంజి ఏడుకొండలు, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లాపల్లి గోపి, షేక్ నీలిమా పాల్గొన్నారు.

బాధితులకు గొట్టిపాటి పరామర్శ



పరామర్శిస్తున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి -బల్లికురవ రూరల్

శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ శనివారం పలువురుని పరామర్శించారు. మండలంలోని కొప్పెర పాడుకు చెందిన బండారు గురు స్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన బుక్యా రమేష్ నాయక్ ఇటీవల పాము కాటుకి గురై మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమేష్ నాయక్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట గ్రామ టిడిపి నాయకులు ఉన్నారు.

పంగులూరు : ఎంఎల్ఎ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని కల్లంవారిపాలెం గ్రామంలో వల్లేరు దానియేలు కుమారుడు అనిల్ కుమార్ వివాహ%శీ% వేడుకలకు హాజరై, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అదే గ్రామంలో ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న వల్లేరు పెద్దబోడియ్యను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు, టిడిపి నాయకులు యర్రం శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కరి వెంకట సుబ్బారావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కుక్కపల్లి ఏడుకొండలు, టిడిపి కళ్ళంవారిపాలెం అధ్యక్షుడు గుదిబండ్ల ఆదిరెడ్డి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కల్లంవారిపాలెంలో శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న గొట్టిపాటి

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని ప్రదేశాల్లో ఫోటో తీసే విధానాన్ని రద్దుచేసి రూ.6వందలు దినసరి కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి మండలంలోని వెదుళ్ళపల్లి, బేతపూడి గ్రామాల్లో ఉపాధి కూలీల పని ప్రదేశాల వద్దకు శనివారం వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 6 గంటలకు వెళ్ళిన కూలీలు 11గంటలకు వస్తున్నారని అన్నారు. పని ప్రదేశాల్లో ఫోటో తీసే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఎన్‌పిఐసి లింకు ద్వారా కులీల హాజరు వేయడం వల్ల పని ప్రదేశాల్లో సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఒక చోట పని చేస్తే మరోచోట హాజరు వేయవలసి వస్తుందన్నారు. దీని వల్ల కూలీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో నెట్ వర్క్ లేకపోవడం వల్ల కూలీలకు హాజరు నమోదు కావడం లేదని కూలీలు వాపోయారని అన్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రూ.6వందలు కనీస వేతనం చెల్లించాలని కోరారు. రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించ కుండా చట్టాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తుందని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న పథకానికి నిధులు కేటాయించాలని కోరారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు నష్టం చేసే సవరణలు మానుకోవాలని కోరారు. గతంలో పలుగు, పారా, పని ప్రదేశానికి ప్రయాణ చార్జీలు ఇచ్చే వారని అన్నారు. వెంటనే వాటిని ఇవ్వాలని కోరారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దినేష్ జాను, రత్నరాజు, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, సుశీల, శివాజీ పాల్గొన్నారు.



కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి కృష్ణమోహన్

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతిరావు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతిరావు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరపకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. బెల్ట్ షాపులు నడిపే వారి సమాచారం తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈపాటికే బెల్ట్ షాపులు నడుపుతున్న వారిపై 45కేసులు నమోదు చేశామని తెలిపారు. బెల్ట్ షాపులు పెట్టకుండా, మద్యం అక్రమంగా అమ్మకుండా గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసం ఉంటున్నారా, ఇళ్ల దగ్గర పెట్రోలు, డీజిల్, కర్రలు, రాళ్ళ వంటి హానికర వస్తువులు ఏమైనా ఉన్నాయాని తనిఖీ చేస్తున్నామని అన్నారు. హానికర వస్తువులు కలిగి ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సంఘటన జరగకుండా ప్రశాం తంగా ఓట్ల లెక్కింపు జరిగేందుకు సహకరించాలని కోరారు. భవిష్యత్తులో కూడా మండలంలో ఎలాంటి గొడవలు లేకుండా చేస్తామని అన్నారు. ఓట్ల లెక్కింపు దగ్గరపడుతున్న నేపథ్యంలోప్రజలను రక్షించేందుకు కృషి చేస్తామని అన్నారు.



రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు



ఇన్వర్టర్ బహూకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

సారస్వత నికేతన్‌కు ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన స్థానిక సారస్వత నికేతన్ గ్రంథాలయానికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాటరీ, ఇన్వెర్టర్ శనివారం బహూకరించారు. ఈసందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం సుధీర్ కుమార్ మాట్లాడుతూ వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు సంతోషదాయకమని అన్నారు. కరెంటు పోయినప్పుడు చదువుకునే పాఠకులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ.25వేల విలువైన ఇన్వర్టర్, బ్యాటరీ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. రోటరీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయానికి అవసరమైన వస్తువుగా గుర్తించి ఇన్వర్టర్ ఇచ్చినట్లు తెలిపారు. డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి, సుధీర్ కుమార్ బహుకరించినట్లు తెలిపారు. సభకు రోటరీ అధ్యక్షులు బట్ట మోహనరావు అధ్యక్షత వహించారు. రోటరీ వ్యవస్థాపక అధ్యక్షులు సీతారాం, రోటరీ కార్యదర్శి ఎవి సురేష్ బాబు, సీనియర్ సభ్యులు ప్రతి వెంకట సుబ్బారావు, కొత్త శ్రీనివాసరావు (వాసు), గ్రంథాలయ కార్యదర్శి పల్లపోతు వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్ శ్రీవల్లి, సాహితీ వేత్త బీరం సుందర్రావు, రిటైర్డ్ ఎఈ యారాసు గణపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ డివి లలిత కుమారి

అభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలం అభివృద్ధికి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ డివి లలితకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ, పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్యుత్, గృహనిర్మాణ తదితర శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు తదితర అంశాలు గురించి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో త్రాగునీటికి సిబ్బంది లేకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ రంగంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు ప్రతి ఒక్కరికి అందే విధంగా వ్యవసాయ సిబ్బంది చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఉపాధి కల్పన, విద్యుత్తు వంటి మౌళిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండలాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలని కోరారు. రైతుల పంటలు రక్షించే విధంగా సాగునీటిని అందించేందుకు అవసరమైన కాల్వలను అభివృద్ధి చేయాలని సూచించారు. నీటి వసతి లేక పంటలు నష్టపోయే పరిస్థితి ఉండ కూడదని అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడనున్న ప్రభుత్వంతో కలిసి మండలం తోపాటు గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరువీదుల ఉదయభాస్కరి, మండల ఉపాధ్యక్షు మల్లోలు ఉషారాణి, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల రాకతో..

పేదోడి ఫ్రిజ్‌కు తగ్గిన గిరాకీ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

రానురాను పేదోడి ఫ్రిజ్‌కు గిరాకీ తగ్గుతోంది. ఆకర్షణీయమైన రంగుల్లో, సైజుల్లో, మోడళ్లలో సరసమైన ధరలకు మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులు దొరుకుతున్నాయి. ఈఎంఐల రూపంలోనూ పెద్ద పెద్ద దుకాణదారులు కస్టమర్ల కు చేరవేస్తున్నారు. ఈ క్రమంలో మట్టి కుండలు కనుమరుగై పోతున్నాయి. పుల్లలచెరువు మండలంలో శాలివాహన కులస్తులు 150 కుటుంబాల వారు ఉన్నారు. వారిలో కేవలం 10 కుటుంబాల వారు మాత్రమే ప్రస్తుతం కుండల తయారీ పనులు చేస్తున్నారు. మిగతా వారంతా వ్యవసాయ పనులు, కిలార్‌నట్, డోలక్ వ్యాపారాలు తదితర పనులు చూసుకుంటూ జీవనం గడుపుతున్నారు. పుల్లలచెరువు మండలంలో వేసవికాలంలో మట్టి కుండలకు గిరాకీ ఉంటుంది. జనవరి నుంచి జూన్ నెల వరకు శాలివాహన కుటుంబాలు కుండల తయారీలో నిమగ్నమవుతారు. కుండలు, బిందెలు, పూల కుండీలు, చలివేంద్రం బానలు వంటి రకరకాల మట్టి వస్తువులు తయారు చేస్తుంటారు. అయితే మార్కెట్లోకి ప్లాస్టిక్, స్టీలు పాత్రలు విరివిగా రావడంతో మట్టి పాత్రల వాడకం తగ్గిపోయింది. వేసవికాలంలోనూ మట్టి పాత్రల వాడకం అంతగా లేదు.





తాను తయారు చేసిన కుండలతో కాశయ్య

మార్కెట్లోకి ఫ్రిజ్‌లు రావడంతో..

మార్కెట్లోకి ఫ్రిజ్‌లు, చల్లటి నీటి వాటర్ క్యాన్లు రావడంతో వేసవికాలం నాలుగు నెలలు కూడా శాలివాహనులకు వృత్తి అంతంత మాత్రంగానే ఉంటుంది. గ్రామాలలో, పట్టణాలలో వందలాది మందిగా ఈ వృత్తిపై ఆధారపడిన వృత్తిదారులు గణనీయంగా తగ్గి, ఇతర వృత్తులు, కూలి పనులకు వెళుతున్నారు. దీంతో ఈ వృత్తిపై ఆధారపడి జీవించేవారి కుటుంబాలు వేళ్ల మీద లెక్క వేసే స్థాయికి దిగజారిపోయింది. శాలివాహన వృత్తికి అంతంత మాత్రంగానే ఆదరణ ఉంటే, దీనికి తోడు గ్రామాలు, పట్టణాలలో వృత్తిదారులకు మట్టి దొరక్క అరకొరగా కుండల వృత్తిపై ఆధారపడిన శాలివాహనులు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కుండలు తయారీ చేసే శాలివాహన వృత్తిదారులకు చెరువులలో మట్టి తవ్వుకెళ్లే హక్కులు ప్రభుత్వం కల్పించడం ద్వారా వృత్తిదారులకు కొంత మేలు జరుగుతుందని శాలివాహనులు అంటున్నారు.

శ్రమతో కూడినది మట్టి కుండలు తయారీ..

మట్టి కుండల తయారీ శ్రమతో కూడిన పని కావడంతో 50 సంవత్సరాల పైబడిన శాలివాహన వృత్తిదారులకు ఒంట్లో జవసత్వాలు సన్నగిల్లి, అనారోగ్యాలకు గురవుతూ పని చేయలేకపోతున్నారు. దీంతో ఈ వృత్తిపై ఆధారపడిన శాలివాహన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. కుండలు కాల్చే బట్టీలకు ప్రభుత్వం స్థలం కేటాయించి, కుండలు కాల్చే సమయంలో వర్షానికి కుండలు దెబ్బతినకుండా బట్టీలపై షెడ్లు నిర్మాణం జరపాలని శాలివాహన వృత్తిదారులు కోరుతున్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వ్య.కా.స. నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు

మేట్ల వ్యవస్థను పునరుద్ధరించాలి: వ్య.కా.స.

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో భాగంగా మేట్ల వ్యవస్థను పునరుద్ధ రించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హనుమంతునిపాడు మండలంలో పెద్దముప్పల పాడు, చిన్నముప్పలపాడు, దాసల్లపల్లి గ్రామాల లో ఉపాధి కూలీల పని ప్రదేశంలోకి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో మండుటెండలో కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, మేట్ల వ్యవస్థ కొనసాగితే ఈ సమస్యల నుంచి కూలీలు బయటపడతారని తెలిపారు. ప్రభుత్వం పరిశీలించి తక్షణమే ప్రతి శ్రమశక్తి సంఘానికి ఒక మేటీని ఏర్పాటు చేయడం ద్వారా కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్‌రెడ్డి రమణారెడ్డి, గూడూరి రాజారావు, కొండయ్య, జేమ్స్, చిన్న, కాంతారావు, రామయ్య, గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-శింగరాయకొండ



సిఐకి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య పై సోషల్ మీడియాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై శనివారం నాడు తెలుగు దేశం పార్టీ నాయకులు కొండేపి నియోజకవర్గంలోని ఆరు మండలాల పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. దామచర్ల సత్య మీద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో గతంలో విశాఖపట్నంలో డ్రగ్స్ తీసుకువచ్చారని, ఇప్పుడు బెంగళూరులో రేవ్ పార్టీకి డ్రగ్స్ సరఫరా చేశారని, మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో దామచర్ల సత్య దిగిన ఫోటోలను వైసిపి నాయకులు సోషల్ మీడియాలో పెట్టి ఉన్నారని అలాంటి వాటి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్‌కు, ఎస్ఐ టి శ్రీరామ్‌కు టంగుటూరు, జరుగుమల్లి, పొన్నలూరు, మర్రిపూడి, కొండపి తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు.

డ్యాన్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు కథలు చదివించడం, కథలు చెప్పించడం, కోకో, డ్యాన్స్, కబడీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విద్యార్థులకు వరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రంథాలయాలు విద్యార్థులకు వరం లాంటివని గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ అన్నారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా పుల్లలచెరువు ఎంఆర్‌సికి చెందిన నాగేంద్రుడి చేత మోటివేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో గల కథల పుస్తకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు, సైన్స్, క్విజ్ పురాణాలు, చరిత్ర వంటి అనేక రకాలైన పుస్తకాలను చదువుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. క్యారంబోర్డ్, చెస్ లాంటివి కూడా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి ఈ వేసవి సెలవులలో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైనింగ్ అధికారుల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-మద్దిపాడు

అక్రమంగా ఇసుక తవ్వే ప్రాంతాలను మైనింగ్ విజిలెన్స్ ఆర్ఐ మురళీకృష్ణ పరిశీలించారు. శనివారం ప్రజాశక్తిలో ఇసుకాసురులు అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెల్లంపల్లి గ్రామంలోని ఇసుక ప్రాంతాన్ని పరిశీలించారు. మండలంలో ఎక్కడైనా ఇసుక తవ్వితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ముందుగా స్థానిక రెవెన్యూ డిపార్ట్‌మెంట్ స్పందించాలని సూచించారు. పరిశీలించిన వారిలో మైనింగ్ అధికారులు, సెబ్ సిఐ, స్థానిక పోలీసులు ఉన్నారు.

సబ్ జైలులో తనిఖీ

ప్రజాశక్తి-గిద్దలూరు



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బి మేరీ సారా ధానమ్మ

గిద్దలూరు సబ్ జైలును శనివారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి మేరీ సారా ధానమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు పరిసరాలను తనిఖీ చేసి ఖైదీలతో మాట్లాడారు. నేరాలను అలవాటుగా చేసుకోరాదని, సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు. న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు మండల న్యాయసేవాధికార సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ యూ లింగారెడ్డి, న్యాయవాది ఎం పిచ్చయ్య యాదవ్, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూదనరావు పాల్గొన్నారు.



జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థి ఎర్రగుంట్ల బ్రెట్లీని అభినందిస్తున్న చందలూరు పాఠశాల ఉపాధ్యాయులు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 22వ తేదీన జరిగిన సెలెక్షన్‌లో బాస్కెట్‌బాల్‌లో చందలూరు స్కూలుకు చెందిన ఎర్రగుంట్ల బ్రెట్లీ అనే 9వ తరగతి విద్యార్థి బాస్కెటబాల్‌లో జాతీయస్థాయి టీముకు ఎంపిక అయ్యారు. 28, 29, 30, 31 తేదీలలో పంజాబ్‌లోని పాటియాలాలో జరిగే జాతీయ టీమ్‌లో ఆడతాడు. వీరు విజయవాడ నుంచి 26వ తేదీన బయలుదేరి అక్కడికి 28వ తేదీన చేరుకుంటారు. ఎంపిక అయిన విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి గురుప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పురజనులు అభినందించారు. జాతీయ స్థాయిలో బాగా ఆడి పాఠశాలకి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పాఠశాల పిడి సోము అంజిరెడ్డిలను అభినందించారు.

వేసవి శిబిరంలో పంచతంత్ర కథలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో పంచతంత్ర కథల గురించి ఉపాధ్యాయుడు సూర్య క్లాసు బోధించారు. శిక్షణా కార్యక్రమమైన 11వ రోజు ప్రారంభంలో పిల్లల చేత కథలు చెప్పించడం, కథలు చదివించడం చేశారు. తరువాత చదరంగం, స్కిప్పింగ్, క్యారమ్, ల్యూడో స్నేక్ ఆటలను ఆడించారు. ఈ శిబిరంలో నలుగురు పిల్లలు మాత్రమే పాల్గొన్నారు. అనంతరం వారికి బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కే సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథ పాలకుడు వై వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కథలు చెప్పించడం, పుస్తక పఠనం, పద్యాలు పాడించడం మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారవీడు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకంతో స్నేహం చేయాలని, స్నేహితుల కంటే కూడా పుస్తకం మంచి నేస్తం అని అన్నారు. గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, విజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. పుస్తక పఠనం నేర్చుకోవాలని, ధైర్యంగా కథలు చదవడం, ఇతరులకు చెప్పడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కూలీలు

ఉపాధి కూలీల ఆవేదన

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం నరవ పంచాయతీ బయనపల్లె గ్రామానికి చెందిన గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు తమకు న్యాయం చేయాలంటూ గిద్దలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద అవేదన వ్యక్తం చేశారు. నరవ గ్రామ పంచాయతీ సర్పంచ్ బండి శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు జరుగుతున్న అన్యాయం, ఫీల్డ్ అసిస్టెంట్ అరాచకత్వంపై గిద్దలూరు మండల గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇన్‌ఛార్జి ఈసి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ ఉపాధి హామీ పథకం పనులకు రాని వారికి హాజరు వేస్తున్నారని, పనులకు వచ్చిన వారికి హాజరు తక్కువ వేస్తూ వేధిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. కూలీలకు హాజరు వేయక పోవటం పై ప్రశ్నించిన ఉపాధి హామీ కూలీలను దుర్భాషలాడుతూ వేధిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.



తిరుమలకు కాలినడక వెళుతున్న వైసిపి నాయకులు

కాలినడకన తిరుమలకు వైసిపి నేతలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే కాక వేమూరు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి అశోక్‌బాబు గెలవాలని కోరుతూ మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తిరుమలకు కాలినడకన బయలు దేరారు. సూరేపల్లి గ్రామంలో వైసిపి నాయకులు కిరణ్, సాయి, కళ్యాణ్ శుక్రవారం బయలు దేరి శనివారంకు వేమూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల్లో జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరారు. వేమూరు వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఎంఎల్‌ఎగా గెలవాలని కోరుతూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలన ముందుకు కొనసాగటానికి జగన్మోహన్‌రెడ్డి సిఎంగా ఉండాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు మర్చిపోలేదని అన్నారు. అందుకే మహిళలు వైసిపిని ఆదరించారని అన్నారు. ఎన్నికల్లో ఎంతో చైతన్యంతో ఓట్లు వేశారని అన్నారు. ఫలితాలు వైసిపికి అనుకూలంగా రావాలని కోరుతూ ఎన్నికల ఫలితాలు నాటికి తిరుమల తిరుపతికి చేరుకోవాలనే దృక్పథంతో ఈ పాదయాత్ర చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం దాడులు, బెదిరింపులతో ప్రజలు ఇచ్చిన తీర్పును మార్చలేరని అన్నారు. ప్రజాతీర్పుకు కట్టుబడి ఉండాలని అన్నారు. పాదయాత్రను కొనసాగిస్తున్న తరుణంలో ఆయా గ్రామాల్లో వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు.



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

బుద్ధుని బోధనలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - బాపట్ల

బుద్ధుని బోధనలను స్ఫూర్తిగా తీసుకుని కుల, మత అసమానతల నిర్మూలనకు యువత నడుం కట్టాలని జన చైతన్య వేదిక అధ్యక్షులు వి లక్ష్మణరెడ్డి కోరారు. బుద్ధ జయంతి సందర్భంగా స్థానిక వ్యవసాయ కళాశాల బివి నాథ్ ఆడిటోరియంలో శనివారం జరిగిన సభలో బుద్ధుని ప్రతిమకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సభలో లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. దేశంలో ఆర్థిక అసమానతల నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. కోరికలు తగ్గించుకొని, బుద్ధుడి మార్గాన్ని అనుసరించాలని కోరారు. మనిషి కోరికలే సమస్యలకు మూలమని, కోరికలు తగ్గించుకుంటే ప్రశాంతమైన జీవనం గడపవచ్చని, మనుషులంతా సమానమేనని బుద్ధుడు చూపిన సందేశం యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైకాలజిస్ట ప్రత్యూష సుబ్బారావు, విశ్రాంత ఆచార్యులు అరవింద్, పౌర సమాఖ్య అధ్యక్షులు కె విజయ్ కుమార్, విశ్రాంత అధ్యాపకులు జి శాంతారామ్, ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, తిరువీధుల శంకర ప్రసాద్, కోట వెంకటేశ్వరరెడ్డి, కరణం రవీంద్రబాబు, అవుల వెంకటేశ్వర్లు, శంకరరావు, సుభాని పాల్గొన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

• పెచ్చులూడుతున్న భవనం • బిల్లులు చెల్లించక అర్థాంతరంగా నిలిచిపోయిన నూతన భవనం • పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న పంచాయితీ భవనం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఎప్పుడూ ఏం జరుగుతుందో ననే ఆలోచనతో బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. దినదిన గండం నూరేళ్ల ఆయుష్ అన్న చదంగా కాలం వెళ్లబుచ్చుతున్నారు. పంచాయతీ కార్యాలయాన్ని గొల్ల పాలెం రోడ్డులో హై స్కూల్, బంగ్లా చెరువు ఆవరణలో 1981లో నిర్మించారు. అనంతరం రెండేళ్ల కాల పరిమితి తర్వాత భవనంపైన మరో అంతస్థు పంచాయతీ అతిథి గృహం కొరకు నిర్మించారు. గత నాలుగేళ్లుగా ఆ కార్యాల యాలు రెండు దెబ్బతినింది. చుట్టూ గోడలు పడిపో యింది. స్లాబ్ ఊడి రాలి పడిపోతూ ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న భయంతో సిబ్బంది ఉన్నారు. పైన అతిథి గృహంలో పంచాయతీకి సంబంధించిన వివిధ రకాల పైపులు, గొట్టాలు, బకెట్లు తదితర పరికరాలు ఉంచేందుకు స్టోర్ రూముగా నిర్వహించారు. పైన ఉన్న భవనం సంబంధించి చుట్టూ గోడలు పడిపోయి, లోపల స్లాబ్ హెచ్చులూడి పడిపోతుంది. వర్షాలు కురిసే సమయంలో పై స్లాబ్ నుంచి నీరు కింద గదిలోకి దిగి ఆ గదిలో సామానంతా తడిసి పాడైపోతుంది. పై గదిలోకి దిగిన నీరు కింద స్లాబ్ నుంచి కింద గదిలోకి సైతం దిగుతున్నది. దీంతో పరికరాలు, ఇతర వస్తువులు తడిసి పాడైపోతున్నాయి. మొదటి అంతస్తులో పంచాయతీ కార్యాలయం సెక్రటరీ ఆఫీసు, పంచాయతీ సర్పంచి గది తోపాటు కంప్యూటర్, ఆఫీసు, సచివాలయం నిర్వహిస్తు న్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఒక పోలింగ్ బూతుగా నిర్వహించారు. ఈ పోలింగ్ బూతులో ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు వర్షం కురిస్తే ప్రజలు ఇబ్బంది పడతారని బ్యాలెట్, వివి ప్యాడ్లు, కంప్యూటర్లు దెబ్బతింటాయని, 13వ తారీకు ఎన్నికల సందర్భంగా వర్షం పడిన సమయంలో ఈ భవనంపై ప్లాస్టిక్ పట్టలు కపి ఎన్నికలు నిర్వహించారు. దీనికి తోడు వైసిపి పాలనలో గత ఐదేళ్లలో పంచాయితీ అధికారులు ప్రత్యేక పాలన ఏర్పాటు సమయం నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో పంచాయతీ సెక్రెటరీగా ప్రతి ఏట ఒకరు చొప్పున ఐదుగురిని మార్చుతూ వచ్చారు. ఎన్నిక సందర్భంగా వైసిపి పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి సర్పంచిగా ఇంకొల్లుకు చెందిన ఏజెన్ల ప్రసన్నలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే వివిధ కారణాలతో పంచాయితీకి వచ్చిన సెక్రటరీలు సర్పంచితో సమన్వయం కుదరక ఎవరి దారి వారిదే అన్న విధంగా పంచాయతీ పాలన లోపభోయిష్టంగా నడిచిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గత కొన్ని రోజుల క్రితం దాదాపు రూ.2కోట్లకుపైగా నిధులు గోల్మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్పంచి, సెక్రటరీలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ వివిధ సాకులతో కాలం వెళ్ళబుచ్చారని, ఉన్నత స్థాయి అధికారులు పూర్తి విచారణ చేయకుండా సర్దిపుచ్చుతూ వచ్చారని చర్చిస్తున్నారు. నిజాయితీ ఆవరణలోనే రూ.40లక్షలపైగా పెట్టుబడితో పంచాయితీకి సంబంధించిన కార్యాలయం నూతనంగా నిర్మించడంతోపాటు సచివాలయం నూతనంగా నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో కార్యాలయం భవనం 90 శాతం పైగా పనులు పూర్తయినప్పటికీ దానికి సంబంధించిన బిల్లులు పూర్తిగా ఇవ్వలేదని కాంట్రాక్టర్ ఆరోపిస్తు న్నారు. ఆ సచివాలయం, పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టరు తుది పనులు పూర్తిచేయకుండా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. తనకు నిధులు వస్తేనే పనులన్నీ పూర్తి చేసి భవనాన్ని పంచాయితీకి అప్పజెబుతానని అంటున్నారు. దీంతో కార్యాలయ భవన నిర్మాణ పనులు అలాగే నిలిచిపోయాయి. కార్యాలయంలో ఉన్న వస్తువుల నిల్వతో భవనం స్లాబు ఎప్పుడు కూలుతుందోనని అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించి పంచాయితీ నూతన భవనాన్ని వినియోగంలోకి తేవాలని పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు కోరుతున్నారు.



దెబ్బ తిన్న పంచాయతీ కార్యాలయం లోపలి భాగం

అల్లాభక్షి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - బాపట్ల

రచయితగా, రంగస్థల కళాకారుడిగా, పాత్రికేయుడుగా సుధీర్ఘ కాలం సాహిత్య, కళా రంగాలకు సేవలందించిన అల్లాబక్షి చిరస్మరణీయులని న్యాయవాది షేక్ జమ్మద్ భాష అన్నారు. తన కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన అల్లాబక్షి సంతాప కార్యక్రమంలో అల్లాబక్షి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ ఆనంద్ బక్షి కలం పేరుతో అల్లాబక్షి అనేక రచనలు చేశారని అన్నారు. ఆకాశవాణిలో ఆయన అందించిన రచనలు ఎంతో పేరు తెచ్చి పెట్టాయని అన్నారు. 1981నుంచి 1986వరకు ప్రజాశక్తి దినపత్రికలో, 1986నుండి 2005వరకు ఈనాడు, ఈ టీవీ-2 ఛానెల్‌లో విలేకరిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని అన్నారు. మా కేబుల్, ఎన్టివి చానెళ్లలో రిపోర్టర్‌గా పని చేశారు. వార్తను సేకరించడమే కాకుండా, విశ్లేషించి వార్తలను అందించడంలో ఆయన పేరు పొందారని అన్నారు. మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పఠాన్ రాజేష్ మాట్లాడుతూ 1979లో యువ కళా భారతి సంస్థను స్థాపించారని గుర్తు చేశారు. ఈ సంస్థ ద్వారా అనేక రేడియో నాటికలు, రంగస్థల నాటికలు రచించారని చెప్పారు. 1991లో భావపురి రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా పలు కార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు. ప్రముఖ రచయిత ఆదం షఫీ మాట్లాడుతూ 1980లో సంఘర్షణ అనే రంగ స్థల సాంఘిక నాటికను రచించి ప్రదర్శించారని అన్నారు. ఉత్తమ జాతీయ నాటికగా ఎంపికై 16 భారతీయ భాషల్లో అనువదించి సరిక్రొత్త ఒరవడిని సృష్టించిందని అన్నారు. నాటక రంగంలో తీరం చేరని కెరటాలు, చైర్మన్ చంద్రయ్య, వెలుగు నీడలు, జీవన పోరాటం, కార్మికులారా ఏకం కండి నాటికలను అల్లాబక్షి రచించారని చెప్పారు. పలు నాటక పరిషత్తులో ప్రదర్శించి అనేక బహుమతులను అందుకున్నారని అన్నారు. ప్రముఖ రంగస్థల సినీ నటులు సయీద్ పీర్ మాట్లాడుతూ శరవేగంగా పరుగులు తీస్తున్న జర్నలిజంలో సరికొత్త భావాలను అద్దం పట్టే విధంగా పాత్రికేయ రంగాన విశేషమైన పేరు, ప్రఖ్యాతలు గడించారని అన్నారు. బాపట్ల సాహితీ రంగ అభివృద్ధికి వెలకట్టలేని సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో సాహితి భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ, ఖాన్ పా ల్గొన్నారు.



అల్లాబక్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి

జయంతిపేటలో కార్డన్ సర్చ్ నిర్వహించిన పోలీసులు

ప్రజాశక్తి - చీరాల

శాంతి భద్రతలకు ప్రజలు అందరూ సహకరించాలని, జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాత ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడ వద్దని, జాగ్రత్త వహించాలని పట్టణ సిఐ సోమశేఖర్ అన్నారు. పట్టణంలోని జయింతిపేటలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో డిఎస్‌పి బేతపూడి ప్రసాద్ ఉత్తర్వులు మేరకు కార్టన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండెందుకు ముందు జాగ్రత్తగా ప్రతి ఇంటిని జల్లెడ పట్టినట్లు తెలిపారు. స్పెషల్ పోలీస్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనలు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇంటి ఆవరణలో పెట్రోల్, డిసెల్, కర్రలు, రాళ్ళు లాంటివి ఏమైనా దాడులకు ఉపయోగించే వస్తువులు ఉన్నాయా అనే అంశంపై పరిశీలించినట్లు తెలిపారు. ఇళ్లలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు ఉంచుకోవద్దని చెప్పారు. ప్రతి ఇళ్లు సోదా చేశారు. ఇళ్లలో బైకులు, ఇతర వాహనాలు పరిశీలించారు. రౌడీ షీటర్స్‌కు వారి ఇంటి వద్దనే కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగకుండా చూసుకొను భాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు. ఎవరైనా పోలీసు ఉత్తర్వులను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాడులకు పాల్పడే వారిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. అనవసరమైన గొడవల్లోకి వెళ్లి కేసులు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సిఐ సోమశేఖర్

చీరాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఐజి

- ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా బహిష్కరణ తప్పదన్న ఎస్పీ వకుల్ జిందాల్
- జూన్ 6వరకు పెట్రోల్ లూజ్ విక్రయించరాదు
- శాంతి భద్రతలకు అందరూ సహకరించాలి

ప్రజాశక్తి - చీరాల

గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటి, ఎస్పీ వకుల్ జిందాల్ చీరాల ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌ను శనివారం సందర్శించారు. నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల రోజు, తదనంతరం తలెత్తిన ఘర్షణలకు సంబంధించి నమోదు చెసిన కేసుల దర్యాప్తు, ముద్దాయిల అరెస్టు వివరాలు పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో, అనంతరం జిల్లాలో ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్బంగా ఎస్పీ వాకుల్ జిందాల్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సమయంలో, తదనంతరం జరిగిన ఘర్షణలకు సంబంధించి నమోదు చేసిన కేసులు దర్యాప్తు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తడానికి అవకాశం ఉన్న అంశాలను, వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలి, ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు ఎలా నిర్వహించాలనే విషయాలపై సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజు సెక్షన్ 144 సిఆర్పిసి, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా ఎవరు గుంపులు గుంపులుగా ఉండరాదని చెప్పారు. సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఇతరులను రెచ్చగొట్టే విధంగా ఏటువంటి వ్యాఖ్యలు చేయవద్దని అన్నారు. ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేవిధంగా సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు మెలగాలని అన్నారు. ఎవరైనా ప్రజా శాంతికి భంగం కలిగించిన, ఓట్ల లెక్కింపు సమయంలో, తదనంతరం ఘర్షణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఘర్షణలకు పాల్పడే వారిపై రౌడీ షీట్ తెరుస్తామని చెప్పారు. ఎక్కువ సందర్భాల్లో ఘర్షణలకు పాల్పడిన వారిపై పిడి చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ విధించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈపాటికే ఎన్నికల రోజు, తదనంతరం ఘర్షణలకు పాల్పడిన వారిపై ప్రతిపాదనలు సిద్ధంచేసి కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో జూన్ 6 వరకు బాణాసంచా విక్రయించరాదని, కాల్చరాదని, పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోలు, డీజిల్ అమ్మ కూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా విక్రయిస్తే వారి అనుమతులు రద్దుచేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్పీ బి ప్రసాద్, సిఐలు శేషగిరిరావు, సోమశేఖర్, ఇంకొల్లు సిఐ బి శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటి



దాతలను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాటిబండ్ల వెంకటేశ్వర్లు 35వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పాటిబండ్ల రంగారావు (క్రాంతి సైకిల్ షాప్) సౌజన్యంతో సింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. 35ఏళ్ల నుండి వారి తండ్రి జ్ఞాపకార్థం రంగారావు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని దేవపాలన పేర్కొన్నారు. రంగారావు దంపతుల్ని రోటరీ ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ చైర్మన్ రావూరి రంగయ్య, రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ఉపాధ్యక్షులు మలాది శ్రీనివాసరావు, సహాయ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, రోటరీ సభ్యులు డాక్టర్ ఉబ్బా దేవపాలన, షేక్ మొహమ్మద్ రఫీ, పసుపులేటి ఆంజనేయులు, అళహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, ఉరిటి వేంకట శ్రీనివాసరావు, రంగారావు దంపతులు పాల్గొన్నారు.

మంచి ప్రవర్తన అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

అంతర్జాతీయ తప్పిపోయిన బాలబాలికల దినోత్సవ సందర్భంగా స్థానిక ఇందిరా కాలనీ ఎంపీపీ పాఠశాల్లో అవగాహన కోసం న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె ప్రశాంతి మాట్లాడుతూ పిల్లలను పాఠశాలకు పంపి చదువుతోపాటు మంచి ప్రవర్తనను అలవాటు చేయాలని సూచించారు. వేసవి సెలవుల్లో పిల్లలను బయటికి వెళ్లినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆడపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలు తప్పిపోయినప్పుడు వెంటనే అక్కడున్న పోలీసు స్టేషన్‌కి రిపోర్ట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు సర్పంచి మల్ల అంజమ్మ, మల్ల శ్రీనివాసరావు, డి రవీంద్రనాథ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కె ప్రశాంతి



సిమెంటు బల్లలు బహూకరించిన రోటరీ ప్రతినిధులు

సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నూతలపాడు, పోతుకట్ల గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు అనువైన ప్రదేశాల్లో కూర్చునేందుకు ఆరు సిమెంట్ బల్లలను రోటరీ క్లబ్ పర్చూరు, భువనగిరి ప్రతినిధులు శనివారం ఎర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో నాగులపాలెం గ్రామంలో 16 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో దాతల సహకారంతో మరికొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. సహకారం అందించిన భువనగిరి క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు పాబోలు ఉదయ భాస్కర్, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, దండా శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆమంచిపై అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి - చీరాల

దళిత డీఎస్పీ బేతపూడి ప్రసాదును చెట్టుకు కట్టేస్తామంటూ అవమానిస్తూ మాజీ ఎంఎల్ఎ ఆమంచి కృష్ణమోహన్ మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం రాత్రి ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పిర్యాదుతోపాటు ఆధారాలను జతచేశారని పోలీసులు తెలిపారు. పిర్యాదు ఆధారంగా అట్రాసిటీ కేసు ఒకటవ పట్టణ పోలీసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని ప్రజాసంఘాల నాయకులకు అందజేశారు.



FIRST INFORMATION REPORT
(Under Section 154 and 157 Cr.P.C)
A.P.P.M. Orders 47...

...t : Bapatla P.S : Chirala I Town Year : 2024 FIR No. 183/2024
... Section(s) : 353,506 IPC,3(2)(va) SC ST POA ACT,7 CLA-1932,34 IPC
...ccurrence of Offence : Day : Date & Time From :
...te & Time To : Prior To : 24/05/2024 00:00 Time Peri...
...nformation Received at P.S. : Date & Time : 24/05/2024 20:00
...neral Diary Reference : Entry No : 15 Date & Time : 24/05/2024 20:0...
...f Information : Written
...f Occurrence :
...istance and Direction From P.S. : 100 Meters ,North Beat No. :
...ddress Place : Area/Mandal : Street/Village :
...ock tower center Chirala Clock tower cen...
...ty/District : Bapatla State : Andhra Pradesh
... case , outside the limit of this Police Station, then
...me of P.S. : District :
...ainant / Informant :
...me : Bonigala Jaison Babu
...ther's / Husband's Name : Musalaiah
...te/Year of Birth : Age : 58
...tionality : Indian e) Caste : Mala
...ssport No : Date of issue : Place of issue :

అట్రాసిటీ కేసు ఎఫ్ఐఆర్ కాపీ

షుగర్‌ను నియంత్రించుకుంటే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - చీరాల

రూ.699లకే షుగర్ వ్యాధికి నెలకు సరిపడే మందులు, రక్తపరీక్షలు చేయించు కోవడంతోపాటు ఆరు నెలలకు ఒకసారి టోటల్ బాడీ చెకప్ మంచిదని డాక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. షుగర్ లెవెల్స్ ఎక్కువ ఉన్నవారు సరైన వ్యాధి నిర్ధారణ చేసుకొని, చికిత్స తీసుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందని చెప్పారు. ఆహార నియమాలు పాటిస్తూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కామాక్షి కేర్ హాస్పిటల్ నందు షుగర్, శుక్లం కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఆత్మలిక్ ఆఫీసర్ డాక్టర్ తాడివలస కుమార్ 66మందికి ఉచిత వైద్య సేవలను అందించారు. రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు తెలిపారు. నెలకు సరిపడా మందులు, షుగర్ రోటీన్ రక్తపరీక్షలు, ఈసీజీ రోటరీ క్లబ్ సహకారంతో రూ.699లకు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నన్నప్పనేని రామకృష్ణ, బాచిన నాగమల్లేశ్వరరావు, అడ్డగడ్డ మల్లికార్జునరావు, రావి రమణారావు, మన్నెం వెంకటేశ్వర్లు, హాస్పిటల్ జీఎం తాడివలస సురేష్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న నవీన్‌కుమార్



కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమంలో శిక్షకులు

ముగిసిన ఉచిత కరాటే శిక్షణ

ప్రజాశక్తి - కర్లపాలెం

స్థానిక శ్రీ రామకృష్ణ సేవా సమితిలో న్యూ స్పోర్ట్స్ కరాటే డూ కాస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, శ్రావణ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ సంయుక్తంగా గత 20 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణ శనివారంతో ముగిసింది. 20రోజుల పాటు 80మందికి శిక్షణ ఇచ్చినట్లు ఎన్ఎస్‌కెకెఎఏపి ప్రెసిడెంట్ ఎన్ శ్రావణ్ కుమార్, సెక్రటరీ కె నవీన్ కుమార్ తెలిపారు. 20 రోజుల పాటు కరాటేలో ఉచిత శిక్షణ ఇచ్చిన శ్రావణ్ కుమార్, నవీన్ కుమార్‌లకు సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎ వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

బైకులు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - చీరాల

ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి కారంచేడు– చీరాల రహదారిలో రామానాయుడు వారధి వద్ద జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బి సాధనరావు (30) గత 3రోజుల క్రితం దైవదర్శనంకు హైదరాబాదు నుండి తిరుపతి వెళ్ళాడు. దర్శనం అనంతరం అక్కడ నుండి శ్రీశైలం వెళ్ళాడు. అనంతరం తిరిగి హైదరాబాదు వెళ్లేందుకు చీరాల నుండి కారంచేడు మార్గంలో ప్రయాణిస్తున్నాడు. అయితే అదే మార్గంలో కారంచేడులో నివాసం ఉంటున్న మర్రిపల్లి ఏడుకొండలు(55) చీరాల వైపుకు ద్విచక్ర వాహనంపై వస్తు ఆ మార్గంలోని రామానాయుడు వారధి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారంచేడు వాసి ఏడుకొండలు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన తెలంగాణ వాసి సాధనరావును స్థానికులు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సాదనరావు మృతి చెందారు. సమాచారం అందుకున్న కారంచేడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు ఏడుకొండలకు భార్య, పిల్లలు ఉన్నారు. సాధనరావు కుటుంబ సభ్యులు సమాచారం తెలుసుకొని హైదరాబాద్ నుండి చీరాలకు బయలుదేరారు.



బి సాధనరావు (30)

రైలు ఢీకొని మాజీ ఉపసర్పంచి మృతి

ప్రజాశక్తి - చీరాల

రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ప్రమాద వశాత్తు రైలు ఢీ కొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని విజయనగర కాలనీ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగర కాలనీ 7వ లైనులో నివాసం ఉంటున్న తేళ్ల బుల్లియ్య (35) ఇంటి సరుకుల కోసం చీరాల వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీ కొందని అన్నారు. స్థానికులు గమనించి తమకు సమాచారం అందించారని అన్నారు. జరిగిన విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యాశాలకు తరలించారు. ఇది ఇలా ఉండగా మృతి చెందిన వ్యక్తి గతంలో విజయనగర కాలనీ గ్రామ ఉప సర్పంచిగా పనిచేసారు. మృతునికి వివాహం జరిగి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న బుల్లియ్య మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆధరువు లేకుండా పోయిందని, ఆ ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి గ్రామస్తులు కోరారు.



రైలు ఢీ కొని మృతి చెందిన బుల్లియ్య

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీలో విద్యుత్ సమస్య లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు లోఓల్టేజీ విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని,ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ డిఇహరిబాబును శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డు కొత్తూరు, చింత గుంట్ల వారి వీధి, రెండవ వార్డులోని బీసీ కాలనీ,11వ వార్డులోని కాశిరెడ్డి కాలనీ, ఎన్‌జిఒ కాలనీ ప్రజలు లోఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు మరియు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అందుకు విద్యుత్ డిఇ సానుకూలంగాను స్పందించి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, విద్యుత్ ఎడి ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న అబ్దుల్ గఫార్

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సమ్మర్ క్యాంప్ శనివారం ఉత్సాహ భరితంగా ప్రారంభమైంది. తొలి రోజు 50 మంది చిన్నారులు పాల్గొని గురజాడ గేయం, క్రాఫ్టింగ్ నేర్చుకున్నారు. ఈ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు తమకు ఇష్టమైన క్రాఫ్టింగ్ తయారు చేసి ప్రదర్శించారు. తోటి విద్యార్థులకు తెలిసిన వాటి గురించి మిగతా విద్యార్థులు నేర్చుకున్నారు. క్యాంపును నిర్వాహకులు సిహెచ్.వినోద్, కె. రమాదేవి, జ్యోతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సజనాత్మకతను వెలికి తీసి, వారిలో సేవా భావాన్ని పెంచడమే ఈ క్యాంపు ఉద్దేశమన్నారు. ఎనిమిది రోజులు పాటు జరిగే క్యాంపులో వివిధ రకాల నిపుణులు విద్యార్థులకు కొత్త విషయాలను తెలియ జేస్తారని తెలియజేశారు. రెండవ రోజున సైన్స్‌తో సరదాగా, మ్యాజిక్ క్లాసు నిర్వహించనున్నట్లు తెలిపారు. మ్యాజిక్‌ను మెషియన్ రామన్ విద్యార్థులకు నేర్పుతారని తెలిపారు.



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

ఓట్ల లెక్కింపునకు సిబ్బంది నియామకం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాకు సంబంధించిన ఓట్ల లెక్కింపుకు సిబ్బందిని నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఆన్ లైన్ ద్వారా కలెక్టరేట్ నుంచి ర్యాండమైజేషన్ చేపట్టారు. నియోజకవర్గాల వార్గీగా ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అధికారులు, సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్‌ఒ. శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, ఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సమస్యపై చర్చా గోష్టి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు సచివాలయం వద్ద తాగునీటి సమస్యపై ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు స్టడీసర్కిల్ నిర్వాహకులు తెలిపారు. ఈ చర్చాగోష్టిలో ప్రజలందరూ పాల్గొని తాగునీటి సమస్య పరిష్కారానికి ఉన్న మార్గాలపై తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని స్టడీ సర్కిల్ నిర్వహకులు కోరారు.

‘ కారు’ కేసును ఛేదించిన పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎఎస్‌పి (క్రైం) శ్రీధర్‌రావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శింగరాయకొండ మండలం మూలగుంటపాడులో కారు తగలబెట్టిన కేసును పోలీసులు స్వల్ప వ్యవధిలోనే ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్దను ఓ బైకును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అదనపు ఎస్‌పి(క్రైం) ఎస్‌వి.శ్రీధరరావు కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ శింగరాయకొండ మండలం మూలగుంటపాడుకు చెందిన లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిగురుపాటి శేషగిరిరావు తన ఇంటి వద్ద ఉంచిన హెూండయ్ క్రెటా కారుపై పాలేటి అభిషేక్, మరో బాలుడు పెట్రోల్ పోసి నిప్పు అంటించారన్నారు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో వారు అక్కడ నుంచి పారిపోయారన్నారు. ఓ స్థల వివాదంలో కనసాని ఈశ్వర్ రెడ్డికి, అశోక్ మధ్య శేషగిరి మధ్యవర్తిగా ఉన్నారని, వారి మధ్య కుదిరిన ఒప్పంద పత్రాన్ని శేషగిరి వద్ద ఉంచారన్నారు. ఈశ్వర్‌రెడ్డి ఆ ఒప్పంద పత్రాన్ని ఇవ్వాలని శేషగిరి రావును అడుగుగా, అందుకు అతను నిరాకరించినట్లు తెలిపారు. దీంతో వారి మధ్య మనస్పర్ధలు వచ్చాయన్నారు. వీటిని దష్టిలో ఉంచుకొని కనసాని ఈశ్వర్ రెడ్డి, తన దగ్గర పనిచేసే ఓ బాలుడు, హైదరాబాద్ నుంచి పిలిపించిన మిత్రుడు అభిషేక్ కలిసి శేషగిరి కారు తగలబెట్టేందుకు పథకం పన్నారన్నారు. ఆ పథకం ప్రకారం శుక్రవారం రాత్రి కనసాని ఈశ్వర్ రెడ్డి మూడు పెట్రోల్ బాటిళ్ళను తెచ్చి అభిషేక్, బాలుడికి ఇచ్చారన్నారు. వారు అర్ధరాత్రి సమయంలో బైకుపై శేషగిరి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. కారుపై పెట్రోల్ పోసి తగల బెట్టి పారిపోయారన్నారు. అందుకు గానూ అభిషేక్‌కు ఈశ్వర్ రెడ్డి రూ.7000 ఇచ్చాడన్నారు. జిల్లా ఎస్‌పి సవాలుగా తీసుకొని ఈ కేసును ఛేదించడానికి తనను, ఒంగోలు డిఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలు ఏర్పాటు చేశారన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి కారు తగలబెట్టిన కేసులోని నిందితులను శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శింగరాయకొండ బైపాస్ రోడ్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. నిందితులు వినియోగించి బైకు స్వాధీనం చేసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ ఘటన కేవలం వ్యక్తిగత ద్వేషంతో జరిగిందని, శేషగిరిని భయభ్రాంతులకు గురిచేసి బాండు కాగితాన్ని తిరిగి తీసుకోవటానికి ఈ చర్యలకు పాల్పడ్డారన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని, జరిగిన ఘటనపై మీడియా మిత్రులు క్షేత్ర స్థాయిలో వాస్తవాలు నిర్ధారించుకొని వార్తలు ప్రచురించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి శ్రీధర్‌రావు

పోలీసులకు ఎస్‌పి అభినందనలు

కారు తగలబెట్టిన కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఒంగోలు డిఎస్‌పి ఎం. కిషోర్ బాబు, శింగగరాయకొండ సిఐ రంగనాథ్, కొండపి సిఐ పాండు రంగారావు, ఒంగోలు టూటౌన్ సిఐ జగదీష్, శింగరాయకొండ ఎస్‌ఐ శ్రీరామ్, జరుగుమల్లి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

దాతల ఆశయాలకు తూట్లు

- దేవాదాయశాఖ ఆధీనంలోని భూముల ఆక్రమణ
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

దేవాదాయశాఖ అధీనంలో ఉన్న భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. పూర్వకాలంలో దాతలు పుణ్య కార్యల కోసం దాతృత్వంలో వందల ఎకరాలను దానం చేశారు. రాజులు, జమిందార్లు కూడా దేవాలయాల కోసం, అన్నదానాల కోసం భూములను దానం చేశారు. అలా దానం చేసిన భూములు వందలాది ఎకరాలు దేవాదాయశాఖ అధీనంలో ఉన్నాయి. ఈ భూములపై ఆ శాఖపై పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా దాతలిచ్చిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి.

బాపట్లకు చెందిన పేరం గరుడాచలం నాయుడు దశాబ్దాల క్రితం దాతృత్వ కార్యక్రమాల కోసం 100 ఎకరాల బూమి దానం చేశారు. దీంతో ఆయన పేరుతోనే కొంత స్థలంలో తూర్పు సత్రాన్ని నిర్మించారు. పూర్వకాలంలో బాటసారులుగా వచ్చే వారు సేదతీరేందుకు, అన్నదానాల కోసం, కులమతాలకు అతీతంగా పేదలు, వితంతువులు కొంత కాలం ఉండేందుకు, కర్మకాండలు, పిండప్రధానాల కోసం తూర్పు సత్రాన్ని ఉపయోగించుకొనేవారు. అనంతరం దాత గరుడాచలం నాయుడు ఇచ్చిస స్థలంలోనే ఆర్‌టిసి బస్టాండ్, టిటిడి కల్యాణమండపం, హోటల్,సాయి బాబా గుడి, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. దీంతో కొంత భూమి ఆక్రమణకు గురైంది. కొంత భూమికి పట్టాలు ఇచ్చారు. చివరికి సత్రం స్థలంలో ఐదున్నర ఎకరాల భూమి మిగిలింది. దీంట్లో 78 సెంట్ల భూమిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు 11 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం వివాదాస్పందంగా మారింది. పట్టణ నడిబొడ్డున కోట్ల విలువ చేసే స్థలాన్ని నెలకు రూ.46 వేల రూపాయలకు లీజుకు ఇవ్వడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాత అశయాలను తుంగలో తొక్కుతూ వాణిజ్యపరమైన అవసరాల కోసం సదరు భూమిని ఇవ్వడాన్ని ప్రతిపక్ష పార్టీల నేతలతో పాటు అధికార పార్టీ నేతలు కూడా ఖండిస్తున్నారు. అధికార యంత్రాంగం అందరు ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గుట్టుగా ఐఒసికి లీజుకు ఇవ్వడం అధికారం అండ లేకుండా సాధ్యపడదని భావిస్తున్నారు.

పేరం గరుడ చలం నాయుడు తూర్పు సత్రం ఆస్తులను వ్యక్తులకో, సంస్థలకో కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించాలని, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌తో చేసుకున్న లీజును రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దాత ఇచ్చిన స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివద్ధి చేయాలని కోరుతున్నారు. క్రీడా మైదానంగా లేదా బహుళ ప్రయోజనకరమైన పార్కుగా తూర్పు సత్రం భూమిని అభివద్ధి చేయాలని, కర్మలు చేసుకోవడానికి ప్రత్యేక భవనం, వసతి కోసం గదులు నిర్మించాలని కోరుతున్నారు. దాత ఆశయం మేరకు వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పు ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ నేతత్వంలో తూర్పు సత్రానికి నూతన కమిటీ ఏర్పాటు చేసి ఆ భూములను ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగం లోకి తేవాల్సి ఉంది.



గరుడ చలం నాయుడు తూర్పు సత్రం